క్లుప్తంగా

గోల్డు మెడల్ సాధించిన సంకల్ప్



గోల్డు మెడల్ అందుకుంటున్న సంకల్ప్

నాగులుప్పలపాడు: పట్టుదల యువతకు విజయాన్ని చేరువ చేస్తుందని గవర్నర్ కౌన్సిల్ చైర్మన్ రమేష్ గెల్లి అన్నారు. హైదరాబాదు వాసవి సేవా కేంద్రంలో బ్యాంక్ మ్యాన్ చాప్టర్ అసోసియేషన్ తరపున టాప్ ర్యాంకర్స్ కు ఇచ్చే గోల్డు మెడల్‌ను 406 వర్యాంకు సాధించిన ఉప్పుగుండూరుకు చెందిన గాదంశెట్టి సంకల్ప్‌కు సోమవారం అందించినట్లు తెలిపారు.

లాసెట్‌లో 116 ర్యాంక్



ప్రహర్ష

కొత్తపట్నం: మండల కేంద్రం కొత్తపట్నం గ్రామానికి చెందిన నరేంద్ర ప్రహర్షకు ఇటీవల విడుదల చేసిన ఏపీలాసెట్ 2024లో రాష్ట్ర స్థాయి 116వ ర్యాంక్ సాధించాడు. ప్రహర్షకు ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ 2024 ప్రవేశ పరీక్షలో ఆల్‌ఇండియా 772 ర్యాంక్ సాధించాడు. పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు నరేంద్ర ధనరాజ్, ప్రశాంతిలు యాదవపాలెంలో ఉన్న మన్రే ప్రార్ధన మందిర దైవ సేవకులుగా పనిచేసి ఆ విద్యార్థిని చదివించుకుంటున్నారు. ప్రహర్ష పదో తరగతి ఒంగోలు అన్నవరంప్పాడులో ఉన్న గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చదివాడు. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ సంతపేటలో ఉన్న వీనస్ జూనియర్ కాలేజీలో విద్యనభ్యస్తున్నాడు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా జైలు సూపరింటెండెంట్ పోచా వరుణా రెడ్డి

ఒంగోలు సెంట్రల్: విజయవాడ శాతవాహన కళాశాలలో అర్చరీ అసోసియేషన్ నిర్వహించిన ఐదో మినీ అర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో క్రిష్ణ మెమోరియల్ స్కూల్‌కు చెందిన పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నెల 22న నిర్వహించిన ఈ పోటీల్లో ఒంగోలు జైల్ వార్డెన్ కొప్పోలు నాగరాజు కుమార్తెలు అభిలాష (అండర్13) గీతాంజలి (అండర్ 10)లు ప్రతిభ చాటారు. వారిని సోమవారం జిల్లా జైలు సూపరింటెండెంట్ పోచా వరుణా రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి సువర్ణ పతకం కైవసం చేసుకోవాలని చిన్నారులను దీవించారు. బాలికలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. తల్లిదండ్రులు నాగరాజు, జయలక్ష్మిలను అభినందించారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

ఒంగోలు సెంట్రల్: కనిగిరి మున్సిపాలిటి పరధిలో చెప్పల బజారు, ప్రధాన వీధుల్లో 250 మందికి పైగా చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా వీధుల్లో దుకాణాలను తొలగించారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండా రెడ్డి, చిరు వ్యాపారులు ఆవేదన చెందారు. జిల్లాలో జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో సోమవారం ఈమేరకు విన్నవించారు. సంవత్సరాలుగా మున్సిపాలిటీ ఆక్రమణ పన్ను చెల్లిస్తూ, విద్యుత్ మీటర్లు కలిగి ఉన్న తమకు ఉపాధి దెబ్బతీయటం తగదన్నారు. ఉపాధి రక్షణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, దర్శి తరహాలో ప్రభుత్వ స్థలాలు తీసుకుని అందులో ఆసరా కల్పించాలని కోరారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.360



పొదిలి వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర సోమవారం గరిష్టంగా కేజీ రూ.360 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 5547 బేళ్లు రాగా, 5088 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 459 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 94వ రోజు వేలం పాటలో 3766 బేళ్లు రాగా 3521 వ్యాపారులు కొనుగోలు చేశారు. 245 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.360, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.254.14 వచ్చింది. డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 89వ రోజు వేలం పాటలో 1781 బేళ్లు రాగా, 1567 బేళ్లు కొనుగోలయ్యాయి. 214 బేళ్లు వివిధ తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.185.99 పలికింది.

అరకొర వసతులతో సిబ్బంది అవస్థలు



అమ్మనబ్రోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈవో మాధురి

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పండుగల పేరుతో నిర్వహించిన సామాజిక పింఛన్ల కార్యక్రమం సచివాలయ సిబ్బందిని తీవ్ర అవస్థల పాలుచేసింది. ఉదయం 6 గంటలకే ఇంటింటికీ వెళ్ళి అర్హులకు పింఛన్ అందించాలని చేసిన హడావిడిలో సిబ్బందికి బయోమెట్రిక్ మిషన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో చాలా మేరకు ఫేస్ గుర్తింపుతో పంపిణీ చేయాల్సి వచ్చింది. అయితే ఉదయం 8 గంటలకే సర్వర్ పూర్తిగా పడిపోవడంతో పింఛన్ అందించలేక సచివాలయ సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. పై నుంచి ఒత్తిళ్లకు తలొగ్గి అర్ధరాత్రి అయినా కూడా చాలా మేరకు సిబ్బంది గ్రామాల్లో ఉన్నప్పటికి సర్వర్ లేకపోవడం, వసతుల లేమితో అర్హులకు పూర్తి స్థాయిలో పింఛన్ అందించలేకపోయారు. పింఛన్ పంపిణీ కార్యక్రమం మండలంలో జెడ్పీ సీఈవో కె.మాధురి, ఎంపీడీవో జయమణి పరిశీలించారు.

అలస్యంగా పింఛన్ల పంపిణీ

కొత్తపట్నం: కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి నెలే పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది. ఉదయం 10 గంటల దాటినా 20 శాతం కూడా పంపిణీ చేయలేదు. కొంత మంది పింఛన్ కోసం పడిగాపులు కాచారు. మరి కొంతమందికి వీధుల్లో పంపిణీ చేశారు. కొంత మంది పింఛన్‌దారులు బ్యాంకులు, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయం చుట్టూ తిరిగారు. అయితే టీడీపీ కార్యకర్తలు పింఛన్ పంపిణీ చేసేటప్పుడు ఎందుకని కొంతమంది విమర్శించారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఒక్కరు కూడా లేకుండా ఇప్పుడు మీరెందుకున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 15 పంచాయతీల్లో 8,102 మంది పింఛన్‌దారులుండగా ఇప్పటి వరకు 7,604 మందికి పంపిణీ చేశారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారిగా సోమవారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. చీమకుర్తి మండలంలోని చినరావిపాడు, చీమకుర్తి పట్టణంలోని క్రిష్టియన్‌పాలెం, అంబేద్కర్‌నగర్‌తో పాటు సంతనూతలపాడు, పేర్నమిట్టలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. చీమకుర్తి నుంచి టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పుట్టా బ్రహ్మయ్య, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, గాలి వెంకట సుబ్బయ్య, రంపతోటి అంకారావు, స్థానికులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులపై ఎస్ఎంసీ సంతృప్తి



ఎస్ఎంసీ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

కొత్తపట్నం: గత ప్రభుత్వం నాడు–నేడు ద్వారా చేసిన పనుల పట్ల పేరెంట్స్ మేనేజ్మెంట్ కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. సోమవారం కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి నేతృత్వంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ అయిలా సుబ్బారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులకు విడుదలైన నిధులు వాటి ఖర్చులు వివరాలు గురించి పూర్తిగా కమిటీకి చదివి వినిపించారు. కమిటీ చైర్మన్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. మొదటగా నాడు–నేడుపనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో డ్రాప్ అవుట్ సంఖ్య తగ్గించడానికి ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో పర్యటించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బాలికలకు వేరుగా పాఠశాల తరగతులు నిర్వహించడానికి జిల్లా అధికారులతో చర్చించి పాఠశాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కమిటీ తీర్మానించింది. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పర్యవేక్షించి మెనూ సక్రమంగా ఉందా లేదా అని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ అండ్ ఎస్‌వీ రమేష్ బాబు, శరత్ చంద్ర, కె. ధనలక్ష్మి, ఎస్ఎంసీ సభ్యులు తంబి బాలాజీ, షేక్ అజీమ్ ఖాన్, వైస్ చైర్మన్ లక్ష్మి, పులి సుజాత, తమ్ము ఉమ, పురిణి పిచ్చయ్య పాల్గొన్నారు.

మాటలను వక్రీకరించారు



మాకం జాన్‌పాల్

ఒంగోలు సిటీ: ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్యవేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి ప్రముఖ పత్రిక (సాక్షికాదు)లో ప్రచురించిందని త్రిపురాంతకం జెడ్పీటీసీ జాన్‌పాల్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ నీటి బిల్లుల విషయంలో గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు గురించి ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం కొర్రీలు వేస్తోందని తెలిపారు. తమ పార్టీ అధినాయకుడు వైఎస్సార్ జగన్ మోహన్ రెడ్డి గురించి తాను మాట్లాడుతూ 'పార్టీ చూడం, కులం చూడం. అన్ని వర్గాల వారికి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పంచాం. కానీ ఇప్పుడొచ్చిన ప్రభుత్వం కచ్చితంగా పార్టీలకి ప్రాధాన్యతనిస్తోంది. పసుప బిళ్ళ పెట్టుకుని పార్టీ ఆఫీసులకు వెళ్ళమంటోంది' అని తాను అన్నానన్నారు. కానీ తమ అధినాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కూడా అప్పుడు ఇదే విధంగా చేసి ఉంటే ఈ రోజు తమకి ఓటమి ఉండేది కాదని.. ప్రభుత్వంలో ఉండే వాళ్లమని తాను అన్నానన్నారు. అయితే ఇది వక్రీకరించి.. పసుపు మాటలు, తెలుగుదేశం అనే పదాలను వదిలేసి వారికి కావాల్సిన రీతిగా పత్రికలో ప్రచురించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థి పార్టీ వారు అనేక ప్రలోభాలకు గురిచేసినా వెళ్ళకుండా వైఎస్సార్ సీపీలోనే ఉన్న నిజమైన పార్టీ కార్యకర్తలమన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ వచ్చిన గ్రామాల్లో గణపవరం గ్రామం ఒకటన్నారు. తమ తండ్రి ఇచ్చిన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

కమనీయం..రమణీయం



అమ్మవారి మంగళ సూత్రంతో అర్చక స్వాములు



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

● వైభవంగా గోపాలకృష్ణుని కళ్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక కొప్పోలులో వేంచేసియున్న రుక్మిణి సత్యభామ సమేత గోపాలకృష్ణ స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ప్రాంగణంలో ముందుగా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక పైన ఉత్సవమూర్తులను కొలువుతీర్చారు. ఆలయ అర్చకుడు పరాంకుశం ప్రసాద్ అర్చకత్వంలో వేదమంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ రుక్మిణి సమేత గోపాలకృష్ణ కళ్యాణ మహోత్సవం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మించి ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళ్యాణం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బాపట్ల కొండయ్య కమిటీ సభ్యులు నాగేశ్వరరావు కోనంకి చిరంజీవి, మోడుబోయిన శీను, పవన్ కుమార్ హనుమాన్, వెంకటేశ్వర్లు, నాగరాజుతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు త్రీమెన్ కమిటీ

ఒంగోలు: ఫీజుల నియంత్రణకు త్రీమెన్ కమిటీని నియమించినట్లు డీఈఓ డి.సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30న సాక్షి జిల్లా సంచికలో ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు ప్రైవేటు.. కార్పొరేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించామన్నారు. స్కూల్స్‌లో యూనిఫాం, పుస్తకాలు పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భవాని అనే విద్యార్థినికి తమ వద్దకు ఫిర్యాదు రాగానే ఎటువంటి అదనపు ఫీజు చెల్లించకుండానే టీసీ ఇప్పించామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను రిట్ పిటిషన్ నెంబర్ 18555/2021ను హైకోర్టు వారు రద్దు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాలను తనిఖీ చేసేందుకు త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశామని, వారు ఇచ్చే త్రీమెన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

బొమ్మరిల్లులో మేయర్ పుట్టిన రోజు వేడుకలు



చిన్నారులకు మిఠాయిలు అందిస్తున్న మేయర్ గంగాడ

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పుట్టిన రోజు వేడుకలు బొమ్మరిల్లు ఆశ్రమంలో చిన్నారుల మధ్య సోమవారం నిర్వహించారు. చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. ఆశ్రమానికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు బైరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

4న దేశ బంద్‌కు మద్దతు తెలపాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు సెంట్రల్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై నిరసన తెలుపుతూ జూలై 4న చేపట్టిన బంద్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యూనియన్ నాయకులు మాధవరావు, ఆంధ్ర శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి. వీరాంజనేయులను సోమవారం వారి కార్యాలయాల్లో కలిసి సంపూర్ణ మద్దతు తెలిపాలని కోరారు. కష్టపడి చదివి పరీక్ష రాసిన విద్యార్థులకు నష్టం జరిగిందని, ఇటువంటి జరగకుండా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డాక్టర్స్ డే



డాక్టర్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



రక్తదానం నిర్వహిస్తున్న ఒంగోలు లెజెండరీ సిటిజన్స్

చీమకుర్తి: డాక్టర్స్‌డే సందర్భంగా రోటరీక్లబ్ సభ్యులు చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లును సత్కరించారు. సోమవారం చీమకుర్తిలోని డాక్టర్ ఇంటి వద్ద ఆయనకు పూలమాలతో శాలువా కప్పి ఘనంగా సత్కరించి డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, సభ్యులు గుండా చినవెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, ముప్పూరి చలమయ్య, పోకూరి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

ఒంగోలు సెంట్రల్: నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ఒంగోలు లెజెండరీ సిటిజన్స్, చార్టెట్ అకౌంట్స్ ఆధ్వర్యంలో వైద్యులను సోమవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. నూతన కమిటీ బాధ్యులు తన్నీరు వెంకటేశ్వర్లు, గ్రంధ శ్రీనివాస్, చార్టెర్డ్ అకౌంటెంట్స్ బాలగంగాధర్, విజయకుమార్, సత్యనారాయణ, రాం ప్రసాద్, జగన్మోహనరావు, కిషోర్, చైతన్య, శంకర్, కిరణ్మయి, వైష్ణవి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, సుబ్రహ్మణేశ్వరి, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వేణు, డాక్టర్ రవితేజలను కొత్త రెడ్ క్రాస్ భవన్‌లో సన్మానించారు. అనంతరం రక్తదానం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ మంగళగిరి నరసింహారావు, అడుసుమల్లి వెంకట రావు, అజయ్ ప్రతాప్ సింగ్, నరాల శెట్టి మస్తాన్ రావు, లక్ష్మణ్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్, లయన్స్ సిటిజన్స్ ప్రెసిడెంట్ హరి తదితరులు పాల్గొన్నారు.

విమాన ల్యాండింగ్ పూర్తి చేయాలి

ఒంగోలు సెంట్రల్: శింగరాయ కొండ వద్ద హైవేపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ తక్షణమే పూర్తి చేసి ఉపయోగం లోనికి తీసుకురావలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సోమవారం పార్లమెంటులో కోరారు. పార్లమెంటు పరిధిలో శింగరాయ కొండ వద్ద 3.60 కి.మీల మేర నేషనల్ హైవే అథారిటీ వారి ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్‌ను అథారిటీ వారు, విమాన సంస్థ వారు జాయింట్ పరిశీలించి చిన్న వంకలు, మలుపులు ఉన్నట్లు గుర్తించారని, వాటిని నిటారుగా వేసేందుకు గల అవకాశాలను పరిశీలించి అందుకు కావలసిన భూమి సేకరణకు రూ. 26.60 కోట్ల అంచనాలతో విజయవాడ నేషనల్ హైవే అథారిటీ అమోదానికి పంపారని, 17 నెలలు గడిచినా దీని నిర్మాణం పూర్తి కాలేదన్నారు. కేంద్ర మంత్రి ఆదేశాలను ఇచ్చినా సరే ఇప్పటికి పెండింగ్‌లోనే ఉన్నదని చెప్పారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. మంచి ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టును తమ జిల్లాలో మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రికి, కేంద్ర మంత్రికి ధన్యవాదాలు చెప్పారు.

కుమారికి ఆత్మీయ వీడ్కోలు



కాంద్రకొండ కుమారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

ఒంగోలు అర్బన్: బ్యాంక్ ఆఫ్ బరోడా ఎంఎస్ఎం ఈ బ్రాంచ్‌లో అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కాంద్రకొండ కుమారిని బ్రాచ్ చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం ఇతర బ్యాంకు సిబ్బంది సోమవారం సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ టెంపరరీ సర్వీసులో చేసి పర్మినెంట్ అయ్యి 25 ఏళ్ల పాటు బ్యాంకులో అంకితభావంతో సేవలందించారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సుఖంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. దీనిలో బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొని సత్కరించారు.

విలేకరులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో ఆరవీటి శ్రీను అతడి కుటుంబ సభ్యులు కలిసి ఇద్దరు విలేకరులపై దాడికి పాల్పడటంపై గిద్దలూరు జర్నలిస్టులు సోమవారం ఖండించారు. ఈ మేరకు స్థానిక సీఐ వైవీ సోమయ్యను కలిసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ముండ్లపాడు గ్రామానికి చెందిన ఆరవీటి శ్రీను గ్రామంలో అనధికారికంగా లేఔట్ వేసి ప్లాట్లు వేశాడని, అదే గ్రామానికి చెందిన సత్యం సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. దీంతో అతడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో సత్యం తనపై దాడి చేస్తున్నారని మరో విలేకరి మున్నాకు ఫోన్ చేయడంతో అతడు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని సత్యంపై జరుగుతున్న దాడిని చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహించిన ఆరవీటి శ్రీను కుటుంబ సభ్యులు మున్న ఫోన్, బైక్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై సత్యం, మున్నాలు ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన సత్యం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విలేకరులపై జరిగిన దాడిని గిద్దలూరు జర్నలిస్టు సంఘం నాయకులు ఖండించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శిగులపల్లె శ్రీనివాసులు, సూరే కృష్ణారావు, రసూల్, రామిరెడ్డి, రాజ్ కుమార్ యాదవ్, సుధీర్, శివ, జగన్, జనార్ధన్‌రెడ్డి, కాశిరెడ్డి, అంకయ్య, ఖాజా, రసూల్, రమణయ్య, ఖలీల్, రఫీ, వేములపాటి శేఖర్, నెమలిగుండం, గిరి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సూపరింటెండెంట్



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు అర్బన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాను సోమవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి జీజీహెచ్‌లోని అంశాలపై చర్చించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వివరించారు.

వదిలేస్తానంటున్నాడు

● కలెక్టర్, ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేసిన యువతి



మాట్లాడుతున్న సుల్తాన్ బి

ఒంగోలు టౌన్: ప్రేమించాడు..పెళ్లి చేసుకున్నాడు..కలిసి కాపురం చేసి ఒక పిల్లాడిని కన్నాడు. రెండో సారి గర్భం దాల్చిన ఆ యువతిని వదిలేసి రెండోపెళ్లికి సిద్ధం అయ్యాడు. ఇదేంట న్యాయం అని ప్రశ్నిస్తే చంపేస్తానంటున్నాడని ఓ యువతి ఆవేదన చెందారు. సోమవారం ఎస్పీ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం స్పందన కార్యక్రమంలో తనకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. బాధితురాలి కథనం ప్రకారం.. కొండపి మండలం నేతివారిపాలెం గ్రామానికి చెందిన షేక్ సుల్తాన్‌బీ కి తలిదండ్రులు లేరు. చిన్నతనంలోనే మరణించారు. పెంచి పోషించిన అమ్మమ్మ కూడా పదేళ్ల క్రితం చనిపోయింది. దాంతో సుల్తాన్ బి గ్రామంలో మేకలు మేపుకుంటూ, టీ కొట్టు పెట్టుకొని జీవిస్తోంది. జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల ప్రసన్న అనే యువకుడు సొంతంగా రైస్ మిల్లు వ్యాపారం చేసేవాడు. తరచుగా టీ కొట్టుకు వచ్చి పోయే వాడు. దాంతో ఇద్దరి మధ్య పరిచం పెరిగింది. అదికాస్త ప్రేమకు దారి తీసింది. ఇద్దరూ కలిసి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. గ్రామంలోనే కాపురం పెట్టారు. గత 4 ఏళ్లుగా అన్యోన్యంగా జీవిస్తున్నారు. వారికి ఒక బిడ్డ కూడా పుట్టాడు. ఆమె ఇపుడు గర్భిణి కూడా. 20 రోజుల క్రితం గ్రామానికి వెళ్లిన ప్రసన్న తిరిగి రాలేదు. అత్తారింటికి వెళ్లి అడిగితే మా అబ్బాయికి మరో పెళ్లి చేస్తున్నాం మని.. నీ దారి నువ్వు చూసుకో అని చెప్పారని.. తిట్టి, కొట్టి. హత్యా ప్రయత్నం చేశారని తెలిపింది. వారి నుంచి తప్పించుకొని కొండపి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించకపోగా లక్ష రుపాయలు ఇప్పిస్తాం, అతడిని వదిలేయ్ అంటూ సలహా ఇస్తున్నారని వాపోయింది. తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంది.

శ్రావణి మాతృమూర్తి కాశమ్మకు అన్నా, ఉడుముల నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కాపు సంఘం జిల్లా నాయకుడు శ్రావణి వెంకటేశ్వర్లు మాతృమూర్తి వెలిశెట్టి కాశమ్మ(83) సోమవారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కొడుకు శ్రావణి వెంకటేశ్వర్లు, పెద్ద కోడలు మాజీ ఎంపీపీ వెలిశెట్టి విజయగౌరి. కాశమ్మ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో కల్లం వెంకట సుబ్బారెడ్డి, యక్కలి శేషగిరిరావు, జి.శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, ఇమ్మడి కాశీనాథ్, శాసనాల వీరబ్రహ్మం, వరికుంట్ల అనిల్, తాడికొండ వెంకటరావు తదితరులు ఉన్నారు.